## రామప్ప దేవాలయంను సందర్శించిన యుకె దేశస్తులు



**ప్రజాపక్షం/వెంకటాపూర్:** మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంను ఆదివారం యూకే( ఇంగ్లండ్) కు చెందిన హోవార్డ్, రేక్ చోంగ్ లు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరిశ్ శర్మ, ఉమాశంకర్ లు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.ఆలయ చరిత్ర, శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ వండర్ ఫుల్ టెంపుల్ రామప్ప అని కోనియాడారు. అనంతరం రామప్ప చెరువు సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట, టూరిస్ట్ పోలిసులు దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

సోమవారం | 24 ఆగస్టు, 2026 | పేజీలు : 04


# యూరియా కోసం రైతుల ఇక్కట్లు

### ఎకరాకు రెండు బస్తాలే...
### బ్లాక్‌లో విక్రయిస్తున్నారంటూ ఆరోపణలు

**ప్రజాపక్షం/ములుగు:** ఖరీఫ్ సాగు వేళ యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఎకరాకు ఐదు బస్తాల వరకు యూరియా అవసరమవుతుండగా ఆన్‌లైన్ బుకింగ్ పేరుతో రెండు బస్తాలకే పరిమితం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనితో అదనపు యూరియా కోసం ఫర్టిలైజర్ దుకాణాలను ఆశ్రయించాల్సి వ స్తోందని, కొందరు వ్యాపారులు కొరతను ఆసరాగా చేసుకుని బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు.



**అదనంగా వసూలు:** ఒక్కో యూరియా బస్తాపై రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం యూరియా కొరత ఉండదని ప్రకటిస్తున్నా...క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని వాపోతున్నారు. పంట సాగు ప్రారంభం నుండి చివరి దశ వరకు ఎకరాకు రెండు బస్తాలు ఏమాత్రం సరిపోవని అంటున్నారు.

**ఎరువుల ధరలతో భారం:** 20 ఎరువుల బస్తాను కూడా అధిక ధరకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎరువుల ధరలు పెరగడంతో చిన్న, సన్నకారు రైతులు సాగు చేయడం భారంగా మారిందని పేర్కొంటున్నారు. ఒకవైపు ఎరువుల ధరలు, మరోవైపు సకాలంలో వర్షాలు లేకపోవడంతో పంటల సాగుపై ఆందోళన నెలకొంది

**అధికారుల పర్యవేక్షణ ఏది?**
ఫర్టిలైజర్ దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు సరైన పర్యవేక్షణ చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనితో కొందరు వ్యాపారులు యూరియాను బ్లాక్‌లో విక్రయిస్తున్నారని చెబుతున్నారు. అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ప్రతి రైతుకు ఎకరాకు ఐదు బస్తాల యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఇంత కొరత ఎప్పుడూ చూడలేదు**



రైతు పర్వతాలు మాట్లాడుతూ తాను 20 ఏళ్లుగా చిన్న, సన్నకారు రైతుగా వ్యవసాయం చేస్తున్నానని తెలిపారు. ఎరువుల కోసం పెట్టే ఖర్చుకు అనుగుణంగా దిగుబడి రావడం లేదన్నారు. ఇటీవల ఎరువుల ధరలు పెరగడంతో చిన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియాను బ్లాక్‌లో విక్రయిస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం యూరియా కొరతను నివారించి రైతులకు అవసరమైన మేర ఎరువులు అందించాలని, అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అధికారుల వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

### ఆలయ నూతన భవన ప్రారంభోత్సవంలో
## ఎమ్మెల్యే నాయిని దంపతులు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ స్నేహనగర్, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ నూతన భవన ప్రారంభోత్సవ శుభ కార్యక్రమానికి ఆలయ నిర్వాహకుల ఆహ్వానం మేరకు వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వారి సతీమణి నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడు తూ ఆధ్యాత్మికతతో పాటు సమాజంలో ఐక్యత, సేవా భావాన్ని పెంపొందించడంలో ఆలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

## భూసేకరణ ప్రక్రియ వేగవంతం




## మహాధర్నా నోటీస్ అందచేసిన ఎంప్లాయీస్ జెఎసి



# భరత కుమార్‌కు మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి సన్మానం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు, జర్నలిజం రంగంలో సేవలందిస్తున్న చీర భరత్‌కుమార్‌కు మదర్ థెరిసా అవార్డు లభించడంపై 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భరత్ కుమార్‌ను ఆయన శాలువాతో సత్కరించి అభినందించారు. వరంగల్ శాఖరాశికుంటలోని శ్రీ రాశ్రీ గార్డెన్స్‌లో ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలందించిన వారికి నిర్వాహకులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భరత్‌కుమార్‌కు మదర్ తెరిసా అవార్డు అందజేశారు. అనంతరం మరుపల్ల రవి మాట్లాడుతూ అవార్డులు అందుకోవడం ద్వారా వ్యక్తులు చేస్తున్న సేవలకు గుర్తింపు లభించడంతో పాటు, భవిష్యత్తులో మరింత సేవ చేయడానికి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. భరత్‌కుమార్‌కు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు రావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ ఉపాధ్యాయులు జంజీరాల మహేందర్, మంద నాగరాజు, కందగట్ల విజయ్‌కుమార్, చెక్క రవి, పూల నవీన్, పరిమళ్ల కిరణ్, బిఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మరుపల్ల గౌతం, తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన నాగూర్ల వెంకన్న

**ప్రజాపక్షం /నడికూడ :** నడికూడ మండల కేంద్రానికి చెందిన ఎండిగా సుజాత–రాజేశ్వరరావు దంపతుల పుత్రిక తేజ శ్రీ–అనిల్‌ల వివాహ మహోత్సవం కన్నుల పండువగ ఘనంగా నిర్వహించారు.ఈ వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు(వెంకన్న)హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వధూవరులతో కొద్దిసేపు ముచ్చటించిన నాగూర్ల వెంకటేశ్వర్లు,వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో ఉన్నారు.

# నారాయణపూర్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కుంట్ల అశోక్

**ప్రజాపక్షం/వెంకటాపూర్ రామప్ప :** నారాయణపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీ కార్యవర్గం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కుంట్ల అశోక్, ఉపాధ్యక్షుడిగా మండల తిరుపతి, ప్రధాన కార్యదర్శులుగా అజ్మీరా సంతోష్, లోటపెట్లేల సుధాకర్, గుగులోత్ ప్రేమ్ సింగ్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కుంట్ల అశోక్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎల్లవేళలా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని,గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై పోరాడుతానని, పార్టీ కోసం అహర్నిశలు పని చేస్తాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామ పెద్దలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి మద్దతు తెలిపారు.

# సెప్టెంబర్ 9న వరంగల్‌లో ఎంఆర్‌పిఎస్ జాతీయ సమావేశం



**ప్రజాపక్షం/గూడూరు:** పద్మశ్రీ ముందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ నూతన మండల స్థాయి జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ గూడూరు మండల ఇన్‌చార్జ్ కొమ్ముమ్మనాగరాజు మాదిగ పిలుపునిచ్చారు.ఆదివారం గూడూరు మండలంలోని ఎమ్మార్పీఎస్ కార్యక్రర్తల సమావేశం నిర్వహించి గ్రామాల వారిగా కమిటీల ఏర్పాటుపై చర్చించారు.ఈసందర్భంగా నాగరాజు మాదిగ మాట్లాడుతూ గూడూరు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నూతన కమిటిలను పూర్తిచేసి సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే జాతీయ సమావేశానికి పెద్ద సంఖ్యలో ఎమ్మార్పీఎస్ శేణులు తరలిరావాలని కోరారు. నూతన తరాన్ని ఎమ్మార్పీస్ ఉద్యమంలో ఒక సైన్యంలా తీర్చిదిద్దాలని భవిష్యత్తులో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తీసుకోబోయే నిర్ణయాలకు ఎమ్మార్పీఎస్ శేణులంతా సిద్ధంగా ఉండాలని అన్నారు.అనంతరం గూడూరు గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కందిక అశోక్ మాదిగ ప్రధాన కార్యదర్శ కందిక రాజుకుమార్ మాదిగ ఉపాధ్యక్షుడిగా కందిక అరుణ్ మాదిగ కోశాధికారిగా మైదం రాంబాబు మాదిగ అధికార ప్రతినిధిగా కందిక శ్రీరామ్ మాదిగ కార్యదర్శిగా కందిక రాజశేఖర్ మాదిగలను ఉన్నుకున్నారు.గౌరవ సలహాదారులుగా కందిక పెద్ద ఐలయ్య మాదిగ కందిక చిన్న ఐలయ్య మదిగ కందిక రమేష్ మాదిగ కందిక యాకయ్య మాదిగ కందిక కృష్ణ మాదిగ కందిక కొమురయ్య మాదిగ మైదం లక్ష్మ య్య మాదిగ తదితరులు పాల్గోన్నారు.

# శివగంగేశ్వర స్వామి ఆలయ మంటప ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** బీజేపీ జిల్లా నాయకులు షేర్ల అనిల్ ఆహ్వాన మేరకు స్విమ్మర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దామెర చెరువు గట్టు పైన అంగరంగ వైభవంగా ఏర్పాటు చేసిన శివగంగేశ్వర స్వామి ఆలయ మంటప ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గంట రవికుమార్ హాజరై శివగంగేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ హిందూ ధర్మం అనేది కేవలం ఒక మతం మాత్రమే కాదని, సనాతన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప జీవన విధానమని అన్నారు. మన పూర్వీకులు అందించిన ఆధ్యాత్మిక సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఆలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా, ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలకు కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. యువతకు మన సనాతన ధర్మం గొప్పతనాన్ని తెలియజేస్తూ, దేవాలయాల పరిరక్షణ, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.శివగంగేశ్వర స్వామివారి ఆశీస్సులతో నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.భక్తి, ఆధ్యాత్మికతను పెంపొందించే కార్యక్రమాలను నిర్వహిస్తున్న షేర్ల అనిల్ మరియు స్విమ్మర్ అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు.

# అనారోగ్య నాయకులకు పరామర్శ



**ప్రజాపక్షం/నెక్కొండః** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల ఇంటికి చేరుకున్న అలంకానిపేట గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ చైర్మన్ గుంటుక సోమయ్య, వార్డు సభ్యుడు సొల్లేటి రవికుమార్‌లను పలువురు బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. మాజీ ఎంపిపి, మాజీ ట్రిబ్యూలర్ సభ్యుడు గటిక అజయ్‌కుమార్, న్యాయవాది కొమ్ము రమేష్ యాదవ్ తదితరులు శనివారం అలంకాపేటలోని వారి నివాసాలకు వెళ్ళి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ వారితో కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడారు. రాజకీయ అనుబంధాలకు అతీతంగా అనారోగ్య సమయంలో పరామర్శించడం మానవీయ విలువలకు నిదర్శనమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాటిపల్లి శివకుమార్, వీరస్వామి, వడ్డే సురేష్, వీరభద్రం తదితరులతో పాటు అలంకానిపేట గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల శానిటేషన్ వర్కర్లను గుర్తించాలి




**ప్రజాపక్షం/గూడూరు:**మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్ల సమావేశం మాదాసు ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది.ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర కమిటి సభ్యుడు ఇసంపల్లి సైదులు మాట్లాడుతూ దశాబ్దాలుగా పాఠశాలల పరిశుభ్రత కోసం సేవలందిస్తున్న శానిటేషన్ వర్కర్లను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేయడంతో పాటు వేతనం అమలు చేయడంతో పాటు వేతనాలను నేరుగా వక్కర్ల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. విధుల్లో మరణించిన వర్కర్ల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకొవాలని ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం బాషికాల బాబుకు నాయకులు నివాళుర్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నెమ్మది వెంకటేశ్వర్లు నాయకలు చాగంటి రవి ధర్యారపు ప్రకాష్ సురేష్ వెంకన్న తదితరులు పాల్గోన్నారు.

# ప్రతి ఇంటికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాడమే లక్ష్యం



**ప్రజాపక్షం/ఖానాపురం:** ప్రతి ఇంటికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాడమే లక్ష్యంమని ఖానాపురం సర్పంచ్ దాసరి రమేష్ అన్నారు. పెద్దమ్మ గడ్డ తండాలో జుగా ప్రోగ్రాం కింద నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాలనే ముఖ్య ఉద్దేశంతో జుగా ప్రోగ్రాం కింద తండా మొత్తం నూతన విద్యుత్ లైన్లను, స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాత లైన్ల వల్ల తరచూ లోవోల్టేజీ, విద్యుత్ అంతరాయం సమస్యలు ఉండేవని, విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో ఈ నూతన లైన్ల పనులు చేపట్టాడం జరిగిందన్నారు. దీని ద్వారా తండాలోని ప్రతి కుటుంబానికి నాణ్యమైన కరెంటు అందనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప్పు రాజు, వార్డు సభ్యులు గుండ్లపల్లి విజయ్, గ్రామస్తులు పల్నాటి శ్రీనివాస్, వల్లెపు శ్రీనివాస్, కందుల సాంబయ్య, భూక్య నవీన్, గుగులోతు గణేష్ పాల్గొన్నారు.

# రిపోర్టర్‌పై దాడి కేసులో మరో ఇద్దరి లొంగుబాటు

**ప్రజాపక్షం/చిట్యాల:** చిట్యాలలో ఆర్‌బీ న్యూస్ రిపోర్టర్ పుల్ల రవీందర్‌పై దాడి కేసులో పరారీల ఉన్న మరో ఇద్దరు ప్రధాన నిందితులు ఆదివారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. కాటారం డిఎస్‌పి ఎ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16న రాత్రి రవీందర్ ఇంట్లోకి చొరబడిన నిందితులు ఆయనపై దాడి చేయడంతో పాటు ఇంట్లోని సామాగ్రిని ధ్వంసం చేశారు. ఈ కేసులో ఇప్పటికే బొజ్జం వేణు, మెంగని నటరాజ్, మొక్కిరాల ప్రణయ్, గోలి అఖిల్‌లను ఈ నెల 19న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు మొక్కిరాల మధువంశీ కృష్ణ(ఏ1), ఎండి ఆరిఫ్(ఏ8) పోలీసుల గాలింపు ముమ్మరం కావడంతో ఆదివారం మధ్యాహ్నం కాటారం డిఎస్‌పి ఎదుట లొంగిపోయారు. వారి నుండి దాడికి ఉపయోగించిన చాక్లెట్ రంగు హోండా సిటీ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహణం నంబర్ టిఎస్07ఈవి9852గా పోలీసులు తెలిపారు. కారును సీజ్ చేసిన అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని భౌతిక దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి ఎ సూర్యనారాయణ హెచ్చరించారు.

# విరహత్ అలీ మాతృమూర్తి మృతికి జర్నలిస్టు నాయకుల సంతాపం

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టియూడబ్ల్యూజే..ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు కె విరహత్ అలీ మాతృమూర్తి బాషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున గజ్వేల్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న యూనియన్ రాష్ట్ర నాయకులు పిన్నా శివకుమార్, టియూడబ్ల్యూజే..ఐజేయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రామచందర్, ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, సీనియర్ నాయకుడు నార్లగిరి యాదగిరి గజ్వేల్‌కు చేరుకొని విరహత్ అలీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాషారత్ ఉన్నిసా బేగం మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం భగవంతుడు ప్రసాదించాలని వారు ప్రార్థించారు.

# బొల్లం కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి

**ప్రజాపక్షం/కమలాపూర్:** మండలంలోని శంభునిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొల్లం రాజిరెడ్డి మాతృమూర్తి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ఆదివారం పరామర్శించి ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు. బొల్లం తిరుపతి రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రాజేశ్వర్ రావు, గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ముస్తాబవుతున్న ముత్యాలమ్మ, బైరవ స్వామి ఆలయం

**ప్రజాపక్షం/కొడకండ్ల:** మండల కేంద్రంలోని చారిత్రక ముత్యాలమ్మ బైరవ స్వామి ఆలయంలో ఈనెల 25న బోనాల జాతర నిర్వహించనున్నారు. సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయితి పాలకవర్గం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఆలయ మరమ్మత్తులు, రంగులు, తాగునీరు, విద్యుత్, రోడ్లు, లైటింగ్, సౌండ్ సిస్టమ్ పనులు చేపట్టారు.

జాతరలో పోతరాజుల కళాబృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రజల సహకారంతో జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. సహకరిస్తున్న ఉప సర్పంచ్ ఎండీ షన్నా, వార్డు సభ్యులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**ప్రజాపక్షం/పాలకుర్తి:** పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సిరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు విస్నూర్ గ్రామంలో మృతుల కుటుంబాలను పరామర్శించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు బాలగాని యాకన్న తండ్రి సత్తయ్య మృతి చెందడంతో భౌతిక కాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే బాలగాని రాజు కుమారుడు ప్రకాష్ ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మార్కెట్ చైర్‌పర్సన్ లావుడియ మంజుల భాస్కర్ నాయక్, నాయకులు రామారావు, శ్రీను, కృష్ణమూర్తి, యాక సోమయ్య, మదార్, భాస్కర్, ఐలేష్, భాస్కర్ నాయక్, సలీం, సర్పంచ్ బాలాజీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నాణ్యతా లోపాలు లేవు.

### తననివేదికలో తేల్చిన సీడబ్ల్యూపీఆర్ఎస్.

**ప్రజాపక్షం/కాళేశ్వరం;** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన అన్నారం సరస్వతి, సుందిల్ల పార్వతి బ్యారేజీలలో ఎలాంటి నాణ్యత లోపం లేదని కాంక్రీట్ క్వాలిటీ పరీక్షల అనంతరం కేంద్ర, జల విద్యుత్ పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్ఎస్) నివేదికలో తేల్చింది. అన్నారం బ్యారేజీలో సందేహం ఉన్న 72 పియర్స్‌పై పరీక్షలు నిర్వహించగా అందులో నూటికి నూరు శాతం ఎలాంటి సమస్యలు లేనట్లుగా పేర్కొంది.సుందిల్ల బ్యారెజిలోని ఏడు బ్లాకుల్లో ఉన్నఅన్ని పియర్స్‌పై జరిపిన పరీక్షల్లో ఒక బ్లాక్‌లో మాత్రమే ఒక శాతం సమస్య ఉందని మిగితా బ్లాకుల్లో ఎలాంటి కాంక్రీట్ నాణ్యత లోపం లేదని తమ నివేదికలో తేల్చినట్లు సమాచారం.కాగా మేడిగడ్డలో 7వ,బ్లాక్ మినహా మిగితాబ్లాక్‌ల్లో నాణ్యత లోపం లేనట్లుగా పేర్కొంటూ కుంగిన7 వ బ్లాక్‌లో కూడా16 నుండి 21 వరకు గల ఆరు పియర్స్ నాణ్యతపై సందేహం ఉన్నట్లుగా పేర్కొంటూ మిగితా పియర్స్‌లో ఎలాంటి నాణ్యతా లోపం లేనట్లుగా తమ నివేదికలో తెలిపినట్లు సమాచారం.

## వేంకటేశ్వర హైస్కూల్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** స్థానిక శ్రీ వేంకటేశ్వర హైస్కూల్‌లో 1982 ఎస్ఎస్‌సి పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆత్మీయత, అనుబంధాల నడుమ ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు దివంగత పోలా చంద్రమౌళి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమ్మేళనంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి, పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు.నాలుగు దశాబ్దాల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్న సహచరులు పరస్పరం ఆప్యాయంగా పలకరించుకుని, పాత స్నేహబంధాలను మరింత బలోపేతం చేసుకున్నారు.భవిష్యత్తులోనూ ఇటువంటి సమావేశాలను కొనసాగిస్తూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సంకల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 40 డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి, వెంకటేశ్వర హై స్కూల్ సెక్రెటరీ కోటేశ్వరరావు, ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపించిన లక్ష్మణ్ అంకం రమేష్, చిమ్మని రవీందర్ గౌడ్, కోటేశ్వర్, కోరే కుమారస్వామి, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరా కోటేశ్వరరావు, ఈ నలభై ఐదు సంవత్సరాల వసంతాన్ని ముందుకు నడిపించిన ఆకుతోట లక్ష్మణ్, అంకం రమేష్, గౌడ కోటేశ్వర్, చిమ్మని రవీందర్, కోరేకుమార్ స్వామి, మామిడాల ఉమేష్, అంకం వేణుమాధవ్, ముఖ్యంగా మ్యాజిక్ తో ఆరాధించిన అడప రవీందర్, ఈగ సరస్వతి, పోశాల విజయలక్ష్మి , దేవసాని సవిత, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా నవీన్



**ప్రజాపక్షం/రఘునాథపల్లి :** మున్నూరు కాపు మండల నూతన కార్యవర్గం ఎన్నికను ఆదివారం మండల కేంద్రంలోని కంచనపల్లి రోడ్ లో మాజీ మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు ఆకుల ఆంజనేయులు ఆధ్వర్యంలో తన వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేయగా మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు నల్గొండ మహేందర్ పాల్గొని మండల మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా రఘునాథపల్లి గ్రామానికి చెందిన గంద్ర నవీన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, మున్నూరు కాపు సంఘం మండల ఉపాధ్యక్షులుగా ఆకుల శ్రీనివాస్, ఎలిశెట్టి రమేష్, ప్రధాన కార్యదర్శిగా అంగిరేకుల సారయ్య, కోశాధికారిగా ఎల్లారెడ్డి గూడెం గ్రామానికి చెందిన పర్వత యుగంధర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు నల్గొండ మహేందర్ మాట్లాడుతూ, మండలం లో మున్నూరు కాపు కులస్తు లందరినీ ఏకం చేస్తూ సంఘం బలోపేతానికి, మున్నూరు కాపు కులస్తుల సంక్షేమానికి నూతన కార్యవర్గం నిరంతరం కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు గంద్ర నవీన్, నూతన కార్యవర్గంతో కలిసి మాట్లాడుతూ, తమపై ఎంతో నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన మున్నూరు కాపు సంఘం నాయకత్వానికి, సంఘం సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి మున్నూరు కాపు సంఘం నాయకులు, సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ముఖ్య నాయకులు, వివిధ గ్రామాల ప్రతినిధులు, యువజన సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థి నేస్తం ఎడ్యుకేషన్ ట్రస్టు జిల్లా న్వీనర్‌గా కొట్టె సతీష్

**ప్రజాపక్షం/కాటారం;** విద్యార్థి నేస్తం ఎడ్యుకేషనల్ ట్రస్టు జయశంకర్ జిల్లా కన్వీనర్గా కొట్టె సతీష్ నియమితులయ్యారు.ఈ మేరకు సంస్థ అడ్వైజర్ కన్వీనర్ డా పి మురళ మనోహర్ ప్రకటన విడుదల చేసారు.మారుమూల ప్రాంతంలో ఉన్నత విద్యను అభ్యసించి స్వయం కృషితో ముదుకు సాగుతూ పేద విద్యార్థులు విద్యార్థినులు చదువుకోవడానికి తనవంతు సహాకారం అందిస్తున్న కొట్టె సతీష్ సేవలను గుర్తించిబాధ్యతను అప్పగించినట్లు మురళి మనోహర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం చారిటబుల్ ట్రస్టుగా విద్యార్థి నేస్తం ఎడ్యుకేషన్ ట్రస్టు యువత సాధికారతే లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు.వికసిత్ భారత్ 2047 నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ట్రస్టు పనిచేస్తుందని అన్నారు.విద్య,ఉపాధి,నైపుణ్యాభివృద్ధి నాయకత్వ వికాసం,వంటి రంగాల్లో యువతకు అవసరమైన అవకాశాలు మార్గదర్శకత్వం అందించేందుకు కృషిచేస్తుందని అన్నారు.అనంతరం కొట్టె సతీష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంస్థ ఫౌండర్ ప్రొఫెసర్ డాక్టర్ విశ్వనాథ్ తెలంగాణ రాష్ట్ర చైర్మెన్ ప్రొఫెసర్ డాక్టర్ గణేష్,అడ్వైజర్ డాక్టర్ మురణీ మనోహర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సంస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులు యువతకు ఉపయోగపడే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని అన్నారు.విద ఉపాధి నైపుణ్యాభివృద్ధి నాయకత్వ వికాసం,యువత సాధికారత కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాలకు సైతం తీసుకెళ్లేందుకు కృషి చేఆస్తానని అన్నారు,కొట్టె సతీస్ నియామకం పై పలువురు విద్యావంతులు,యువత,విద్యార్థి సంఘాల ప్రతినిధులు,సంస్థ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.జిల్లా యువతకు మరింత మెరుగైన అవకాశాలు అందేలా ఆయనాధ్వర్యంలో సంస్థ కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## చిన్నారులను, నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆదివారం మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో కొడకండ్ల మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాల్ని కుమార్ విమల దంపతుల కుమార్తె, కుమారుడి సారి, దోతి వేడుకలలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం మండల కేంద్రంలోని అక్షర గార్డెన్‌లో కొడకండ్ల గ్రామ వార్డు సభ్యులు కోటరాజు మేనకోడలు వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దావెర అనిల్ కుమార్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిసిల ఐక్యతతోనే న్యాయం

**వర్ధన్నపేట/ప్రజా పక్షం:** బీసీల ఐక్యతతోనే రాజకీయ,ఆర్థిక, సామాజిక న్యాయం సాధ్యమవుతుందనీ బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు.అదివారం వర్ధన్నపేట మండలకేంద్రంలోని ఫిరంగడ్డలో పూజారి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఏరియా సమావేశంలో అయన మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రాతిపదికన విద్య,ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో తగిన వాటా కల్పించాలని కోరారు. కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏరియా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మార్త సారంగపాణి, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా చిదురాల కేదారి, అద్యక్షుడిగా బొంత రవి, ప్రధాన కార్యదర్శిగా బక్కతట్ల రాజు యాదవ్, కార్యదర్శులుగా పూజారి శ్రీనివాస్,నక్కరాజు, ఉపాధ్యక్షులుగా ఉప్పునూతల రాజయ్య, ఆలకుంట సుధాకర్, దాసరి బిక్షపతి, ఆలకుంట లక్ష్మణ్, సహాయ కార్యదర్శులుగా బొంత వెంకన్న మేర సారంగపాణి, ఓర్పు వెంకన్న, పెసరు సాంబయ్య,నేరటి ఎల్లయ్య, నారెల్లి సుధాకర్, సలహాదారులుగా డాక్టర్ ఆడెపు శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

## రహదారి పనులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** పట్టణంలో కొనసాగుతున్న ప్రధాన రహదారి అభివృద్ధి పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహ్మద్ మసూద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. పనుల పురోగతిని పరిశీలించిన నాయకులు నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగేలా పనులను పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మహ్మద్ మసూద్, బచ్చన్నపేట సర్పంచ్ అల్వాల నర్సింగరావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బచ్చన్నపేట రహదారి సమస్యను పట్టించుకోకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుతం జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రహదారి అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకిషన్ గౌడ్, రాములు, మల్లయ్య, నారాయణ రెడ్డి, నాయకులు బాలరాజు, రమేష్, నర్సిరెడ్డి, కొండ బాబు, లక్ష్మయ్య, రాము, చిరంజీవి, రాజయ్య, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సమష్టి పోరాటంతో 2 కిలోమీటర్ల రోడ్లు అభివృద్ధి పనులకు శ్రీకారం

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** బచ్చన్నపేట టౌన్ 2 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభం కావడం పట్టణ ప్రజల సమష్టి కృషికి దక్కిన విజయమని ఫైట్ ఫర్ బచ్చన్నపేట సభ్యులు పేర్కొన్నారు. రోడ్డు అభివృద్ధి కోసం వ్యాపారులు, పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజలు కలిసి చేసిన పోరాటం ఫలితంగానే నిధులు మంజూరయ్యాయని తెలిపారు. బచ్చన్నపేట అభివృద్ధి కోసంం ప్రతి ఒక్కరు కలిసికట్టుగా ముందుకు రావాలని, ఇదే స్పూర్తితో పట్టణంలోని ఇతర సమస్యల పరిష్కారానికి కూడా సమిష్టిగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫైట్ ఫర్ నాయకులు అఖిల్, చంద్రమౌళి, యాకం రెడ్డి, అజయ్, రమేష్, వెంకటేష్, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం శ్రీకృష్ణ ఉత్సవ కమిటీ సన్నాహక సమావేశం

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జనగామ పట్టణంలో యాదవ సంఘం శ్రీకృష్ణ ఉత్సవ కమిటీ సన్నాహక సమావేశం ఆదివారం స్థానిక గాయత్రి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. అధ్యక్షుడు ముత్తయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సెప్టెంబర్ 4న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా యాదవులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యాదవ సంఘం నాయకులు, సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భద్రకాళీ పెయింట్స్ నూతన షాప్ ప్రారంభించిన సర్పంచ్ సునీత

**ప్రజాపక్షం/గూడూరు:** గూడూరు గ్రామపంచాయతీ పరిధిలోని మహబూబాబాద్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన భద్రకాళి పెయింట్స్ షాప్ ను ఆదివారం సర్పంచ్ సునీత కొమ్మాలు నాయక్ ప్రారంభించారు.ఈసందర్భంగా సర్పంచ్ సునీత కొమ్మాలు నాయక్ మాట్లాడుతూ గూడూరు మండల కేంద్రంలో పెయింట్స్‌కు సంబంధించిన నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి రావడం ప్రజలకు నిర్మాణ రంగానికి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.నూతనంగా ప్రారంభించిన భద్రకాళి పెయింట్స్ వ్యాపారం అభివృద్ధి చెందాలని నిర్వాహకులు పాయిరాల వెంకటేష్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తులు మెరుగైన సేవలు అందిస్తూ వ్యాపారాన్ని విజయవతంగా కొనసాగించాలని పలువురు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బీరం శ్రీపాల్‌రెడ్డి రూపురెడ్డి వెంకటరెడ్డి కార్యకర్తలు పాల్గోన్నారు.

## ఇంద్రకరణ్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం

-డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** కంది మండలం ఇంద్రకరణ్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి హాజరై నూతన గృహన్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేరు తోందని అన్నారు. ప్రతి కుటుంబానికి సొంత ఇళ్లు ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమన పేర్కొన్నారు. పేద ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ ఇళ్లు నిలుస్తున్నాయన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు.

## బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

**ప్రజాపక్షం/తొర్రూర్:** బాధిత కుటుంబాలకు బాసటగా మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. ఆదివారం ఉదయం చర్లపాలెం గ్రామంలో కీ,శే,లు మేకపోతుల సత్తెమ్మ అకాల మరణం చెందగా ఆమె మొదటి సంవత్సరిక కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజల పక్షాన ఉంటూ బడుగు బలహీనుల బలోపేతానికి వారి వ్యక్తిగత వికాసానికి తోడ్పాటును, చేయూతనందిస్తుందని, బాధిత కుటుంబాన్ని ఓదార్చి వారు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ రాజయ్య మీడియాతో మాట్లాడుతూ నేటి యువతరేపటి భవిత అని ప్రజల కోసం ఏర్పడిన ప్రజాస్వామ్య దేశంలో యువత రాజకీయాల్లోకి రావాలని,దేశ భవిత యువత రాజకీయాలపై ఆధారపడి ఉందని,పేద ధనిక లింగ బేధ ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ సమాన ఓటు హక్కు కల్పించారని, ఐదు సంవత్సరాలకోసారి, ఎన్నికల నిర్వహణ,రిజర్వేషన్ ప్రక్రియ, నచ్చినవారికి ఓటు వేసే స్వేచ్ఛా హక్కులు కల్పించబడిందని, ప్రజాస్వామ్య పునాదులు మన గ్రామ పంచాయితీలని, ఆర్ధిక స్వలంబన బలోపేతానికి రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేయనైనదని, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపారమైన నమ్మకంతో, స్థానిక స్వయం పరిపాలన సంస్థల్లో అనుభవం ఉన్న నాకు బాధ్యతలు అప్పగించారని, చిత్త శుద్ధితో ప్రతి మారుమూల గ్రామ పంచాయితీల అభివృద్ధి ధ్యేయంగా వ్యవస్థకు, ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హెచ్.ఆర్.లక్స్ స్టూడియో ప్రారంభం



**ప్రజాపక్షం /పటాన్‌చెరు :** మల్లారెడ్డి వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీత రెడ్డి హెచ్ ఆర్ లక్స్ స్టూడియో బ్యూటీ ఆకాడమీ సౌందర్య సంరక్షణకు వృత్తి శిక్షణకు వేదికగా నిలుస్తుంది. పటాన్చెరు ఆగస్టు 2026 మిసెస్ యూనివర్స్ ఇంటర్నేషనల్ గ్లోబల్ క్వీస్ 2025 విజేత హెమలత రెడ్డి పటాన్చెరు లోప్రారంభించిన ప్రీమియం బ్యూటీ డిస్టినేషన్ హెచ్.ఆర్.లక్స్ స్టూడియోను ముఖ్య అతిథిగా ప్రారంభించిన మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతీరెడ్డి ప్రకటించారు. ఈ స్టూడియో సమగ్ర బ్యూటీ సేవలతో పాటు త్వరలో వృతిపరమైన శిక్షణనిచే హెచ్.ఆర్ లక్స్ స్టూడియో బ్యూటీ ఆకాడమీని ప్రారంభించనున్నారు. పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్‌ప్రతి తెలిపారు. హేమలత రెడ్డి ప్రత్యేక ప్రాక్టికల్ శిక్షణ పూర్తి చేసి బ్యూటీ వెల్నెస్ రంగాల్లో నైపుణ్యం కలిగించి ఈ స్టూడియోను స్థాపించిందని ఆకాడమీ ద్వారా స్థానిక యువతకు ప్రోఫెషనల్ మేకప్, హెయిర్ స్టైలింగ్ నెయిల్ ఆర్ట్ స్కిన్‌ట్రీట్మెంట్ పర్మనెంట్ మేకప్ వంటి కోర్సులు అందించి ఉపాది అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. హెచ్‌ఆర్ లక్స్ స్టూడియో యజమాని హెమలత తెలిపారు. స్టూడియోకు ప్రత్యేక వీఐపీ గదులు ప్రైవేటు ట్రీట్మెంట్లు పూర్తి గోప్యంతో ప్రీమియం సేవలు అందిస్తున్నాం ప్రారంభోత్సవ మైన నెలలోనే బ్యూటీ ఆకాడమీ ప్రారంభానికి సన్నాహకాలు సాగుతున్నాయని తెలిపారు. ప్రాంతీయంగా హైటెక్ సీటీ బంజారాహిల్స్ వరకు వెళ్లాల్సిన అవసరాన్ని తొలగించి పటాన్చెరు పరిసర ప్రాంతాల వారికి ప్రీమియం సెలూన్ ,గ్రూమింగ్ వృత్తిపరమైన శిక్షణను స్థానికంగానే అందించడం మా లక్ష్యమని చెప్పారు. ఆకాడమీ కోర్సులు క్యూరిక్యులమ్స్ ,బ్యాచ్లు సర్టిపికేషన్లు ప్రవేశ వివరాలు ప్రారంభోత్సవ సమయానికి ప్రకటిస్తామన్నారు.

## శబరిమల అయ్యప్ప సేవా సమాజం ఏర్పాటు

జిల్లా కమిటీ సభ్యులుగా ఇద్దరు గురుస్వాములు



**ప్రజాపక్షం /హత్నూర :** శబరిమల అయ్యప్ప సేవా సమాజం సంగారెడ్డి జిల్లా నూతన కమిటీలో హత్నూర మండలాని కిచెందిన గురు స్వాములు గణేష్ ,అంజనేయులు గౌడ్ లకు స్థానం దక్కింది. జిల్లా కమిటీ సభ్యులుగా హత్నూర గ్రామానికి చెందిన గురుస్వామి, అంజనేయులు గౌడ్,దౌల్తాబాద్ గ్రామానికి చెందిన గణేష్ గురుస్వాములను జిల్లా కమిటీ సభ్యులుగా నియమిస్తూ జాతీయ ప్రధానకార్యదర్శి గురుస్వామితో పాటు రాష్ట్ర కమిటీ నాయకులు నియామక పత్రాన్ని అందజేసి శాలువా మెమంటోలతో ఘనంగా సత్కరించారు. సేవా సమాజం జిల్లా కమిటీలో అవకాశం కల్పించినందుకు రాష్ట్ర జిల్లా కమిటీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే హత్నూర మండల స్థాయి కమిటీ కూడా ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. అయ్యప్ప సేవా సమాజం ఆద్వర్యంలో సామాజిక కార్యక్రమాలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి,రాష్ట్ర కార్యదర్శులు సుదాకర్ గౌడ్ ,గురుస్వామి శేఖర్ గురుస్వామి,జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు,

## విద్యుత్ లైన్ కోసం పచ్చని చెట్లకు గొడ్డలి వేటు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం మొక్కల పెంపకం పథకంలో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షించాలనే సంకల్పంతో ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి రోడ్ల పక్కన మొక్కలు నాటుతుంటే విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంతో చెట్లను నరికి వేస్తున్నారు. అల్లాదుర్గం రేగోడు వెళ్లే దారిలో వెంకట్రావుపేట్ శివారులో రోడ్డు కిరువైపులా హరిత హారం కింద నాటిన చెట్లను అల్లాదుర్గం శివార్లో కొత్తగా ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ సంస్థ నుండి వెంకట్రావుపేట్ సబ్ స్టేషన్ కు విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ లైన్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డు వస్తున్నాయని అనుమతి లేకుండా చెట్ల కొమ్మలు నరికి వేశారని గ్రామస్తులు తెలిపారు. ఉన్నతాధికారులు కొమ్మలు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం జిల్లా కో కన్వీనర్‌గా బరిగే నర్సిహులు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం సిద్దిపేట జిల్లా కో కన్వీనర్‌గా బరిగే నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని ముదిరాజ్ భవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ జర్నలిస్టు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామానికి చెందిన బరిగే నర్సింలును సిద్దిపేట జిల్లా కో కన్వీనర్‌గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు నీలకంఠం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు నియమాక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ జిల్లాలోని ముదిరాజ్ జర్నలిస్టులను ఏకం చేసి సమస్యల పరిష్కారం కోసం అందరి సహకారంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పరమేశ్వర్‌తో పాటు ఆయా మండలాల ముదిరాజ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.



## ముదిరాజ్ జర్నలిస్టుల ఐక్యతే లక్ష్యం

**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట్ :** ముదిరాజ్ జర్నలిస్టులను ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయడమే లక్ష్యంగా తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ బోయిగూడ ముదిరాజ్ భవన్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లాల వారీగా కన్వీనర్లు నియామకం చేపట్టారు. మెదక్ జిల్లా కన్వీనర్‌గా శంకరంపేట (ఎ) కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ వెంకటేశం ముదిరాజ్ ను ఏకగ్రీవంగా నియమించారు. జిల్లాలోని ముదిరాజ్ జర్నలిస్టులను సమన్వయం చేస్తానని, త్వరలో పూర్తి స్థాయి ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం జిల్లా కమిటీ వేస్తామని వెంకటేశం ముదిరాజ్ తెలిపారు.

## బాలాజీ అనురాధ సూపర్ స్పెషాలిటీ హస్పిటల్ ప్రారంభం

- జిల్లా కేంద్రాల్లోనే 90 శాతం వైద్యచికిత్సలు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం /సంగారెడ్డి :**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నారాయణఖేడ్‌ల నియోజకవర్గ పర్యటన లో నారాయణ ఖేడ్ పట్టణంలో ఆధునికంగాఏర్పాటు చేసిన బాలాజీ అనురాధ సూపర్‌స్పెషాలటీ హాస్పిటల్ ను మంత్రి దామోదర్ రాజనర్సింహ స్థానిక శాసన సభ్యులు డా.సంజీవరెడ్డి కలిసిప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను మంత్రి పరిశీలించారు. నారాయణ ఖేడ్ ప్రాంత వైద్య అవసరాలను దృష్టిలో పెటుకొనిఏర్పాటు చేసిన ఆసుపత్రి నిర్వాహకులను మంత్రి అభినందించారు. తెలంగాణ రాష్ట ప్రభుత్వం విద్యా వైద్య రంగాల అభివృద్ధికి ఎంతో ప్రాదాన్యత ఇస్తుందన్నారు. జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య చికిత్సలకు సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆసుపత్రులను ,ప్రజా వైద్య ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న సేవలకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ,జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్, నారాయణ ఖేడ్, సబ్ కలెక్టర్ హరిణి ,ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ పట్లోళ్ల అనురాగ్ రెడ్డి ,డాక్టర్ కె. శ్రీదర్ స్థానిక ప్రజా ప్రతినిదులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## గుండెపోటుతో విలేకరి కన్నుమూత



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన విలేకరి గొల్ల రమేష్ యాదవ్ గుండెపోటుతో మృతి చెందారు. శనివారం రాత్రి భోజనం చేసిన అనంతరం నిద్రపోయిన ఆయనకు అర్ధ రాత్రి సమయంలో గుండె పోటు వచ్చింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు తెలిపారు. రమేష్ యాదవ్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత 15 ఏళ్లుగా ఉమ్మడి మండలంలో వివిధ పత్రికల్లో విలేకరిగా పనిచేశారు. ఆయన మృతితో స్థానిక పాత్రికేయులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

## ఉద్యోగుల సంక్షేమానికి సురేష్ సేవలు మరింత విస్తరించాలి



**ప్రజాపక్షం/గూడూరు;** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కె సురేష్‌కు అరుదైన గౌరవం దక్కింది.ఆల్ ఇండియా ఇండియన్ బ్యాంక్ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి రాష్ట్రల ఎగ్జిక్యూటివ్ కమిటి (ఈసి) సభ్యుడిగా ఆయన ఎన్నికైన ఘన విజయం సాధించారు.బ్యాంకింగ్ రంగంలో విధి నిర్వహణతో పాటు ఉద్యోగుల సంక్షేమం సమస్యల పరిష్కారం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న కె సురేష్ ను ఉద్యోగుల ప్రతినిధిగా కీలక బాధ్యతలకు ఎన్నుకోవడం పట్ల సహచర ఉద్యోగులు సన్నిహితులు హర్షం వ్యక్తం చేశారు.ఈఎన్నిక ఆయనపై ఉద్యోగులు ఉంచిన నమ్మకానికి నిదర్శనమని పలువురు పేర్కొన్నారు.నూతన బాధ్యతల ద్వారా ఉద్యోగుల హక్కుల సంక్షేమం కోసం మరింత సమర్ధవంతంగా పనిచేస్తూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. ఉమ్మడి రాష్ట్రల ఎగ్జిక్యూటివ్ కమిటి సభ్యుడిగా కె సురేష్ ఎన్నిక కావడం కొత్తగూడ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొంటూ ఆయనకు ఉద్యోగులు శ్రేయోభిలాషులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతల్లో సురేష్ మరింత విజయవంతంగా రాణించాలని వారు ఆకాంక్షించారు.